





నామినేటెడ్ పోస్టులపై
కాంగ్రెస్ నేతల దృష్టి!

- రాష్ట్రస్థాయి కార్పొరేషన్లు, జిల్లాస్థాయి పోస్టుల కోసం ఉమ్మడి జిల్లా నేతల ప్రయత్నాలు
- హైదరాబాద్‌లో ఉండి మంత్రులను కలుస్తున్న నేతలు
- ఈ దఫా ఎలాగైనా నామినేటెడ్ పోస్టులు తెచ్చుకునేందుకు ప్రయత్నాలు
- ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో ఏడుగురికి అవకాశం

నిజామాబాద్, మే20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల ఫలితాల తర్వాత నామినేటెడ్ పదవులను భర్తీ చేయనుండటంతో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతలు జోరుగా ప్రయత్నాలను చేస్తున్నారు. పార్టీ కోసం పదేళ్లుగా తాము చేసిన పనులను వివరించడంతోపాటు రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి నామినేటెడ్ పదవుల్లో అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రస్థాయిలో కొన్ని కార్పొరేషన్ పదవులు భర్తీ చేయడంతో ఉమ్మడి జిల్లా నుంచి ఏడుగురికి అవకాశం రాగా మిగతా నేతలు ఈ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. మళ్లీ స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వస్తే కోడ్ అమల్లో ఉండటం పదవులకు అడ్డంకిగా ఉండనుండటంతో ఫలితాలు వెలువడగానే ఈ పదవులను తెచ్చుకునేందుకు ఉమ్మడి జిల్లాకు చెందిన సీనియర్ నేతలు గట్టి ప్రయత్నాలను చేస్తున్నారు. ఎమ్మెల్యేలతోపాటు రాష్ట్రస్థాయి మంత్రులు, పార్టీ నేతల ద్వారా ఈ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. కొత్తగా పార్టీలో చేరిన కొంతమంది నేతలు కూడా తమ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు.

• మొదటి దఫాలోనే కొందరికి దక్కిన పదవులు


రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్సీలతో పాటు కొన్ని కార్పొరేషన్ పదవులను భర్తీ చేసింది. పదేళ్లపాటు పని చేసిన నేతలకు ఈ పోస్టుల్లో అవకాశం కల్పించింది. తొలి దఫాలోనే ఉమ్మడి జిల్లా నుంచి ఏడుగురికి రాష్ట్రస్థాయి చైర్మన్‌గా అవకాశం ఇచ్చారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్‌కు నామినేటెడ్ కోటాలో ఎమ్మెల్సీగా నియమించారు. ఉమ్మడి జిల్లాలో సీనియర్ నేత, రాష్ట్ర పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎన్ఎస్‌యూఐ నుంచి పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ వరకు పదవులు నిర్వహించడంతో మొదటి దఫాలోనే ఎమ్మెల్సీగా ఎమ్మెల్యే కోటాలో నియమించారు. తర్వాత మాజీ మంత్రి షబ్బీర్ అలీకి క్యాబినెట్ హోదాతో కూడిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులుగా నియమించారు. రాష్ట్రస్థాయిలో మైనార్టీలలో సీనియర్ నేత కావడం, పలుమార్లు మంత్రిగా పనిచేసిన ఆయనకు ఈ అవకాశాన్ని కల్పించారు. ఉమ్మడి జిల్లా నుంచి తాహెర్‌బిన్ హందాన్‌ను ఉర్దూ అకాడమి చైర్మన్‌గా నియమించారు. రాష్ట్ర సహకార సంఘాల లిమిటెడ్ చైర్మన్‌గా జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా అన్వేష్‌రెడ్డిని, రాష్ట్ర ఆగ్రో చైర్మన్‌గా కాసుల బాల్‌రాజ్‌ను నియమించారు. నిజామాబాద్ జిల్లా నుంచి నలుగురికి అవకాశం ఇవ్వగా కామారెడ్డి జిల్లా నుంచి ఇద్దరికి అవకాశమిచ్చారు. రాష్ట్రస్థాయి పోస్టులు ఇంకా ఉండటంతో ఉమ్మడి జిల్లాకు చెందిన మరికొంతమంది సీనియర్ నేతలు నామినేటెడ్ పోస్టుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

• కార్పొరేషన్ పదవులు పొందేందుకు గట్టి ప్రయత్నాలు

రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవుల కోసం ఉమ్మడి జిల్లా నేతలు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఉమ్మడిజిల్లా నుంచి ఎక్కువ మంది ఈ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. ఈ జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలతోపాటు రాష్ట్రస్థాయి నేతలను కలుస్తూ తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. కొంతమంది ఎమ్మెల్యేల ద్వారా నేరుగా సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తూ నామినేటెడ్ పోస్టుల్లో తమకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో నిజామాబాద్, బాల్కొండ, బాన్సువాడ, కామారెడ్డి నియోజకవర్గాల నుంచి ఇప్పటివరకు నామినేటెడ్ పదవులను ఇచ్చారు. నిజామాబాద్ రూరల్, బోధన్, ఆర్మూర్, జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గాల నుంచి ఇంకా పదవులను ఇవ్వలేదు. రాష్ట్రస్థాయి కార్పొరేషన్లకు అవకాశాలు రాని వారు జిల్లాస్థాయి పోస్టుల్లో అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో వ్యవసాయ మార్కెట్ కమిటీల పాలకవర్గాలు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీచేసి తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. వీటిలో కొన్ని పెద్దమార్కెట్ కమిటీలు ఉండటంతో ఎక్కువమంది ప్రయత్నాలు చేస్తున్నారు. ఇవేకాకుండా జిల్లాగ్రంథాలయ సంస్థ, నిజామాబాద్ పరిధిలోని నుడా పాలకవర్గాలు ఉన్నాయి. వీటిలో తమకు అవకాశమివ్వాలని సీనియర్ నేతలు కోరుతున్నారు. ఉమ్మడి జిల్లాల పరిధిలో ఈ నామినేటెడ్ పోస్టులే కాకుండా దేవాలయ పాలకవర్గాలు కూడా ఖాళీగా ఉన్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలోని పదేళ్లపాటు పార్టీ కోసం పని చేసిన వారికి అవకాశాలు వస్తాయని పార్టీ నేతలు భావిస్తున్నారు.

• పార్లమెంట్ ఫలితాల తర్వాత భర్తీకి అవకాశం?

పార్లమెంట్ ఫలితాలు వెలువడిన తర్వాత భర్తీ చేసే అవకాశం ఉండటంతో హైదరాబాద్‌లో ఉండి ఈ ప్రయత్నాలను చేస్తున్నారు. పార్లమెంట్ ఫలితాలు వెలువడిన కొన్ని రోజుల్లోపే స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుండటంతో ఆలోపే ఈ పదవులు భర్తీ చేసే అవకాశం ఉండటం వల్ల ముందస్తుగా నేతలు ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. ఎలాగైనా తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. పదేళ్లపాటు పార్టీకి వారు చేసిన సేవలను వివరిస్తూ పూర్తిస్థాయిలో ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు జూన్ 4న రానుండగా జూన్ 6న కోడ్ ముగియనుంది. ఆ తర్వాతే వీటిపై దృష్టిపెట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాకు చెందిన సీనియర్ నేతలు మాత్రం ఎన్నికల పోలింగ్ ముగియగానే హైదరాబాద్‌కు వెళ్లి ఈ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. కోడ్ ముగిసిన తర్వాత ఎంత మందికి రాష్ట్రస్థాయి కార్పొరేషన్లు వస్తాయో ఎంతమందికి జిల్లాస్థాయి నామినేటెడ్ పోస్టులు దక్కుతాయో తేలే అవకాశం ఉంది.



- జిల్లాలో ప్రతీరోజు 82వేల మందికి ఉపాధి
- కోరిన వారందరికీ పని కల్పిస్తున్న అధికారులు
- ప్రతీ 15 రోజులకు కూలీల ఖాతాలో కూలి జమ
- ఇప్పటివరకు జిల్లాలో 136.6 కోట్ల విలువైన పనులు
- గ్రామాల్లో ఆగిన వలసలు

• సాంపల్లి తండాలో కొనసాగుతున్న ఉపాధి పనులు

పండుగలా ఉపాధి పనులు!



నిజామాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రామీణ ప్రాంతాల్లో వలసను ఆపాలనే సదుద్దేశంతో అమల్లోకొచ్చిన ఉపాధిహామీ చట్టం గ్రామీణ ప్రాంత కూలీలు, కార్మికులను ఎంతోగానో ఆదుకుంటోంది. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు పండుగలా సాగుతున్నాయి. వ్యవసాయ పనులు తక్కువగా ఉండటంతో గ్రామాల్లో గడిచిన నెలన్నర రోజులుగా కూలీలు అధిక సంఖ్యలో ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారు. గ్రామాల్లో గుర్తించిన పనులను కూలీల ఆధ్వర్యంలో చేపడుతున్నారు. వారుచేసిన పనులకు నిబంధనల మేరకు నమోదు చేస్తున్నారు. కేంద్రప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా డబ్బులను కూలీల ఖాతాలో జమ చేస్తున్నారు. ఉష్ణోగ్రతలు పెరగడం వేరే ప్రాంతాలకు వెళ్లి పనిచేయలేని సమయంలో ఈ ఉపాధిహామీ చట్టం గ్రామీణప్రాంత కూలీలకు ఎంతో ఆదుకుంటుండగా పని కోరిన వారందరికీ అధికారులు ఉపాధి కల్పిస్తున్నారు. జిల్లాలో గడిచిన నెలరోజులుగా ప్రతీరోజు 80 వేల నుంచి 82 వేల వరకు కూలీలు పనులకు హాజరవుతున్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల పరిధిలో పనులను కల్పిస్తుండటంతో ఉపాధిహామీ ద్వారా పనులు చేసి వేతనాలను పొందుతున్నారు. వర్షాకాలం ఆరంభం వరకు కూలీల సంఖ్య పెరగనుండటంతో పనులు ఎక్కువగా చేసేందుకు అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లను చేస్తున్నారు.

జిల్లాలో 2.55 లక్షల జాబ్ కార్డులు

యూపీఏ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంతంలోని వ్యవసాయ కార్మికులు, కూలీలకు పని కల్పించేందుకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఈ చట్టం కింద గత కొన్నేళ్లుగా జిల్లాలోని కూలీలు ఉపాధి పొందుతున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం ఈ చట్టం కింద ఉపాధి పనులను గ్రామాల్లో కల్పిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం కూలీలకు వేతనాలను చెల్లిస్తున్నారు. జిల్లాలో 2లక్షల 55వేల 197 జాబ్ కార్డులు ఉన్నాయి. ఈ కార్డుల ఆధారంగా 4 లక్షల 83వేల 762 కూలీలకు పని కల్పిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ చట్టం గ్రామీణ ప్రాంతంలోని కూలీలకు ఎంతో ఉపయోగపడుతోంది.

ఏప్రిల్, మేలో అత్యధికంగా..

వ్యవసాయ పనులు మార్చి నెలాఖరు వరకు ఉంటుండగా ఏప్రి ల్, మే నెలల్లో ఎక్కువమంది ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్నారు. జూన్‌లో వర్షాలు పడేంతవరకు కూలీలు ఈ పనులు చేస్తున్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి వంద రోజులు పని కల్పించడంతో ఒకే కుటుంబంలోని వారికి ఎంతగానో ఉపయోగపడుతోంది. ఉపాధి హామీ పనులు లేని సమయంలో జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన కూలీలు ప్రస్తుతం ఈ పనులతో ఇక్కడ ఉపాధి పొందుతున్నారు. వేసవి ఆరంభం నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం మొదలు కాగానే జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ నిర్ణయించిన పనుల ఆధారంగా గ్రామాల్లో ఉపాధి కూలీలకు పనులు కల్పిస్తున్నారు.

కాల్వల పనుల్లోనూ ఉపాధి కూలీలు

జిల్లావ్యాప్తంగా చెరువుల్లో పూడిక తీయడం, చెక్‌డ్యామ్‌లు రిపేర్ చేయడం, కాల్వలను సరిచేయడంతోపాటు ఇతర పనులను ఉపాధి కూలీలతో చేయించారు. ఈ పనులతో కూలీలందరికీ ప్రతీరోజు పని కల్పిస్తున్నారు. కేంద్రప్రభుత్వం ఈ వేసవి ఆరంభం నుంచే కొత్త ఆర్థిక సంవత్సరంలో ఉపాధి కూలీని రూ.300కు పెంచింది. ప్రస్తుతం గ్రామాల్లో పనులు లేకపోవడంతో అన్ని మండలాల పరిధిలో కూలీలు పనులకు హాజరవుతున్నారు. ప్రతీ రోజు 80వేల నుంచి 82 వేల మధ్య కూలీలు పనులకు హాజరవుతున్నారు. పెంచిన వేతనాన్ని ప్రతీ కూలీకి సరాసరి రూ.180 నుంచి రూ.250 వరకు వస్తోంది. గ్రామీణ ప్రాంతంలో ఉదయం 6 గంటల నుంచి 10 గంటలలోపే ఈ పనులు చేపించడంతో కూలీలు ఎక్కువ సంఖ్యలో హాజరవుతున్నారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడంతో ఉదయం పూటే పనులు చేపడుతుండటంతో వేరే ఉపాధి లేక ఎక్కువ కుటుంబాలు ఈ పనులు చేస్తున్నాయి.

ఎన్ఐసీలో ఉపాధి పనుల నమోదు

జిల్లాలో ఉపాధిహామీ చట్టం కింద చేపడుతున్న పనులను ప్రతీ రోజు ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేస్తున్నారు. కూలీల ఆధారంగా అటెండెన్స్‌ను వేస్తున్నారు. వారు చేసే పనులను కూడా ఫొటోలు తీసి వాటిలో పెడుతున్నారు. ఈ వివరాల ఆధారంగా వారు చేసిన పనికి అనుగుణంగా ప్రతీ 15 రోజులకు ఒకసారి వేతనాలను కూలీల ఖాతాలో జమ చేస్తున్నారు. జిల్లాలో మే 13 వరకు ఈ డబ్బులను వారిఖాతాల్లో వేశారు. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం ఆరంభం నుంచి ఇప్పటి వరకు 136.6 కోట్ల విలువైన పనులను కూలీల ఆధ్వర్యంలో చేపట్టారు. వర్షాల ఆరంభం వరకు మరిన్ని పనులను చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లావ్యాప్తంగా కొత్త పనులను గుర్తించడంతో పాటు వానాకాలం ఆరంభం కానుండటంతో రైతులకు ఉపయోగపడే పంట కాల్వలను ఎక్కువగా సరిచేసే విధంగా ఈ పనులను చేపడుతున్నారు. చెరువు గట్లను సరిచేయడంతో పాటు చెరువుల్లో పనులను కొనసాగిస్తున్నారు.

అన్ని మండలాల పరిధిలో ఉపాధి పనులు

• సాయాగౌడ్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

జిల్లాలో అన్ని మండలాల పరిధిలో ఈ పనులు కొనసాగుతున్నాయి. ప్రతీరోజు గ్రామాల పరిధిలో ఎంతమంది కూలీలు వచ్చినా పనులు కల్పిస్తున్నాం. వర్షాల ఆరంభం వరకు ఇదే రీతిలో కూలీలు వచ్చే అవకాశం ఉంది. ఎక్కువ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం.



డిచ్‌పల్లిలోని అమృతాపూర్‌లో ఉపాధి పనులు



• హోటల్ కిచెన్ పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

నగరంలోని పలు హోటళ్లలో
మున్సిపల్ అధికారుల తనిఖీలు

- కిచెన్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంపై ఆగ్రహం
- ప్లాస్టిక్ వాడకంపై హోటల్ యజమానులు, సిబ్బందికి అవగాహన



హోటల్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు

సుభాష్‌నగర్, మే 20: నగరంలోని పలు హోటల్స్‌లో మున్సిపల్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సోమవారం ఉదయం నగరంలోని అంగిరి, బిర్యాని హౌజ్‌తో పాటు సుమారు 10 హోటల్స్‌లో ఉదయం నుంచి తనిఖీలు నిర్వహించారు. హోటల్ యజమానులకు కిచెన్ మరియు ఇతర సెక్షన్‌లలో పరిశుభ్రత పాటించాలని అన్నారు. అపరిశుభ్రంగా ఉంటే తనిఖీలు నిర్వహించి పెనాల్టీలు వేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్లాస్టిక్ వాడకంపై కూడా హోటల్ యజమానులకు అవగాహన కల్పించారు. హోటల్స్‌లో కిచెన్ పరిసరాలను పరిశీలించారు. కొన్ని హోటళ్లలో అప రిశుభ్రంగా ఉండటంతో హోటల్ యజమానులపై మండిపడ్డారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని వస్తామని హోటల్‌ను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ తనిఖీల్లో శానిటరి ఇన్‌స్పెక్టర్లు నటరాజ్‌గౌడ్, ప్రభుదాస్, సునీల్, శ్రీకాంత్, మహిపాల్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



• పరీక్షలపై సమీక్షలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

పకడ్బందీగా ఇంటర్
సప్లిమెంటరీ పరీక్షలు

నిజామాబాద్ అర్బన్, మే 20: ఈనెల 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు కొనసాగనున్న ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ ఎస్.కిరణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై ఆయన సోమవారం తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 17వేల 327మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలకు హాజరు కానున్నారని ఇందులో మొదటి సంవత్సరం 11,282, ద్వితీయ సంవత్సరం 6045 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. జిల్లావ్యాప్తంగా 37 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని ప్రతీరోజు రెండు సెషన్స్‌లలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పోలీస్, రెవెన్యూ, ఆర్టీసీ, పోస్టల్, మెడికల్ అండ్ హెల్త్ తదితర లైన్ డిపార్ట్‌మెంట్‌లకు చెందిన జిల్లాస్థాయి అధికారులను ఇప్పటికే ఏర్పాట్లపై సమీక్షించామన్నారు. విద్యార్థులు పరీక్షలు ప్రారంభమయ్యే నిర్ణీత సమయానికి ముందే తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకోవాలన్నారు. కళాశాలల నుంచి హాల్‌టికెట్లు పొందాలని, లేదా నేరుగా వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్ల ద్వారా పరీక్షకు హాజరుకావచ్చన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని పరీక్ష జరిగే సమయాల్లో పరీక్ష కేంద్రాల వద్ద గల జిరాక్స్ సెంటర్లను మూసివేయాలన్నారు. ప్రశ్నపత్రాలను పోలీసు బందోబస్తు మధ్య తీసుకెళ్లాలని ఆయన సూచించారు. వేసవి తీవ్రత దృష్ట్యా ప్రతి పరీక్ష కేంద్రంలో మంచినీటి వసతితో పాటు పరిశుభ్రతమైన వాతావరణం, వెలుతురు, ఇతరత్ర సౌకర్యాలతోపాటు ఫస్ట్‌ఎయిడ్ కిట్‌తో పాటు ఏఎన్ఎంలు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. పరీక్షలు జరిగే సమయాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. పరీక్ష సమయానికి అనుగుణంగా ఆర్టీసీ బస్సులను నడపాలని సూచించారు. ఎక్కడా కాపీయింగ్‌కు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



కేంద్రప్రభుత్వ అసిస్టెంట్ సెక్షన్ అధికారుల గ్రామసందర్శన

కామారెడ్డి టౌన్, మే 20: మండలంలోని పద్మాజీవాడిలో జరిగిన అభివృద్ధి పనులను శిక్షణలో ఉన్న కేంద్రప్రభుత్వ అసిస్టెంట్ సెక్షన్ అధికారుల బృందం సోమవారం పరిశీలించారు. డాక్టర్ మర్రిచెన్నారెడ్డి మానవవనరుల కేంద్రం హైదరాబాద్ ఆధ్వర్యంలో శిక్షణలో ఉన్న అధికారులు గ్రామస్థాయి సందర్శన నిర్వహించారు. గ్రామంలో ఇంత వరకు చేసిన సీసీరోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, హరితహారం, విద్యుత్ దీపాల ఏర్పాటు గ్రామ పంచాయతీ నిర్వహణ తదితర అంశాలపై గ్రామంలో క్షుణంగా పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.









ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

కామారెడ్డిటౌన్, మే 20: ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. సోమవారం ట్రాన్స్‌ఫోర్ట్ కాంట్రాక్టర్‌లు, రైస్‌మిల్లుల ప్రతినిధులు, సహకార, మార్కెటింగ్, పౌరసరాఫరాల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు నాలుగు రోజుల్లో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని రైస్‌మిల్లుల యాజమానులు ఎప్పటికప్పుడు అన్‌లోడ్ చేయించుకోవాలని సూచించారు. సివిల్‌సప్లయ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 350 కొనుగోలు కేంద్రాలలో రూ.583 కోట్ల విలువైన 2.64లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు రైతులకు ఖాతాలలో రూ.529కోట్ల జమచేసినట్లు చెప్పారు. 97శాతం ట్యాబ్ ఎంట్రిపూర్తయిందని వెల్లడించారు. రవాణాశాఖ అధికారులు లారీలను ఏర్పాటుచేయడంలో కీలకపాత్ర పోషించాలని సూచించారు.







ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



రోడ్డు పక్కన ఉన్న చెత్తను తొలగించిన అధికారులు

పారిశుధ్య చర్యలు చేపట్టిన అధికారులు

బాన్సువాడ, మే20: 'సంగోజీపేట్‌లో పడకేసిన పారిశుధ్యం' అనే శీరికన సోమవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామ కార్యదర్శి మోహన్‌కు గ్రామంలో నెలకొన్న పారిశుధ్యలోపంపై చర్యలు చేపట్టారు. డ్రైనేజీలు శుభ్రపర్చి రోడ్డుపక్కన ఉన్న చెత్తాచెదారాన్ని తొలగింపజేశారు. కంపోస్టు షెడ్డును ఉపయోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. గ్రామంలో ఎక్కడ చూసిన పరిశుభ్రత కనిపించడాన్ని చూసి గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు.

ఘనంగా లక్ష్మీనారాయణ స్వామి కల్యాణోత్సవం

కమ్మర్‌పల్లి, మే20: చౌట్‌పల్లిలోని లక్ష్మీనారాయణ స్వామి కళ్యాణోత్సవం సోమవారం కనులపండుగగా నిర్వహించారు. అలయ బ్రహ్మోత్సావాలలో భాగాంగా రెండోరోజు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అగ్నిప్రతిష్ట, నిత్యహోమం, బలిహరణం, ధ్వజారోమనం, భేరీపూజ, దేవతాఅహ్వాణం, స్వామివారి ఎదుర్కోలు, కార్యక్రమాలతోపాటు మధ్యాహ్నం స్వామివారి కల్యాణం, మాహనసేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని అర్చకులు, గ్రామకమిటి సభ్యులు కోరారు.

షాహిన్ ఆసుపత్రి ఘటనపై అధికారుల విచారణ

పెద్దబజార్, మే 19: వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఓ మహిళ గర్భశయాన్ని తీసివేయాల్సి వచ్చిన ఘటనపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు విచారణ చేపట్టారు. సోమవారం నగరంలోని ఖిల్లారోడ్‌లోగల షాహిన్ ఆసుపత్రిలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అంజన విచారణ జరిపారు. వైద్యులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలు సేకరించారు. ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నారు. తప్పిదం జరిగినట్లు తేలితే తదుపరిగా ఆసుపత్రి యాజమాన్యంపై చర్యలు తీసుకోనున్నారు.

'మంత్రాల నెపంతో దాడి చేసిన వారిని శిక్షించాలి'

పెద్దబజార్, మే20: చిందు కళాకారులుగా జీవిస్తున్న వృద్ధ దంపతులు, తమ కుటుంబ సభ్యులపై అకారణంగా భౌతిక దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని హమ్నాపూర్ చిందు కళాకారులు పులింటి శ్రీనివాస్, శంకర్, కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మంత్రాలు చేసి పశువులను, మనుషులను చంపుతున్నామని, తమను చంపాలని దాడి చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమపై కర్రలతో, సీసాలతో తలపై దాడి చేసినట్లు వర్ని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు.

తూకాల్లో జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఖిల్లా, మే 20: తూకాల్లో జరిగే మోసాల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా వ్యవహరించాలని వినియోగదారుల సమాచార కేంద్రం అధ్యక్షుడు మాయావర్ రాజేశ్వర్ సూచించారు. తూనికల కొలతల దినోత్సవం సందర్భంగా అసిస్టెంట్ కంట్రోలర్ నిర్మల్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని గంజ్ ప్రాంతంలో దినోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూనికల కొలతల విషయంలో వినియోగదారులు జాగ్రత్తగా పాటించాలన్నారు. కొనుగోలు చేసే సమయంలో ఐఎస్ఐ మార్క్ లాంటివి మాత్రమే కొనుగోలు చేయాలని, కొన్న వస్తువుకు వ్యాపారస్తుల నుంచి బిల్లులు తీసుకోవాలని బిల్లులు ఉన్నట్లయితే వినియోగదారుల ఫోరం కోర్టులో ఫిర్యాదు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. వ్యాపారస్తులు కిరాణా షాపుల్లోగానీ, సూపర్ మార్కెట్‌లోగానీ వస్తువులు కొనుగోలు చేసినప్పుడు తూకం సరిగా వేస్తున్నారా, ఎలక్ట్రానిక్ కాంటాల ద్వారా తూకం వేసినప్పుడు కరెక్టుగా తూకం వేసే విషయాలను గమనించాలన్నారు. వ్యాపారస్తులు తక్కువ తూకం వేస్తే, ఎంఆర్‌పీ రేటు కంటే ధరలు ఎక్కువగా తీసుకున్నట్లయితే తూనికల కొలతల శాఖకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్స్‌పెక్టర్ సుజాత్‌అలీ, టెక్నికల్ అసిస్టెంట్ సురేందర్ రావు, నరేష్, సుస్మిత్ వినియోగదారులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న బోలేరో పట్టివేత

కోటగిరి,మే20: పొతంగల్ మండల కేంద్రంలోని మంజీర నది నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న బోలేరో వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పొతంగల్ గ్రామంలో ఏపీ29టీవీ7849 వాహనాన్ని తనిఖీ చేయగా ఇసుకను గుర్తించి పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జీపీ సిబ్బంది వేతనాలు చెల్లించాలి: సీఐటీయూ

కోటగిరి, మే20: గ్రామ పంచాయతీ సిబ్బంది బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహన్ డిమాండ్ చేశారు. కోటగిరి మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో గత 8నెలలుగా పంచాయతీ సిబ్బందికి వేతనాలు చెల్లించకపోవడం బాధకరమన్నారు. జీతాలు లేకుండా సిబ్బంది ఎలా పని చేస్తారని ప్రశ్నించారు. పంచాయతీ సిబ్బంది కుటుంబ పోషణ కోసం అప్పుల పాలవుతున్నారని వాపోయారు. ప్రభుత్వం తక్షణమే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మల్టీపర్పస్ వర్కర్ విధానంతో తీవ్ర పని ఒత్తిడి పెంచిందని ఆరోపించారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఎండలు మండిపోతున్న పనులు చేయించడం సరికాదన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది యూనియన్ అధ్యక్షురాలు రాజేశ్వరి, రజిని, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు, రుణాలను సకాలంలో అందించాలి

బోధన్‌రూరల్,మే20: రైతాంగానికి సకాలంలో విత్తనాలు, రుణాలు అందించాలని అఖిల ప్రగతిశీల రైతు సంఘం నాయకులు పడాల శంకర్ అన్నారు. సోమవారం బోధన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ పనులు చేయడానికి రైతాంగం సిద్ధమవుతున్నారని, ప్రభుత్వం రైతాంగానికి అవసరమైన విత్తనాలు, జీలుగ విత్తనాలను మాత్రమే పంపిణీ చేసిందని, వీటితో పాటు అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ ఉత్పత్తి సాధనాలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. వడగండ్ల వర్షంతో నష్టపోయిన రైతులకు గత ప్రభుత్వం ఇస్తానన్న 10వేల రూపాయలు కూడా ఇప్పటి వరకు చెల్లించలేదని, ప్రస్తుతం నష్టపోయిన రైతులకు 25వేల రూపాయల నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అఖిల ప్రగతిశీల రైతు సంఘం నాయకులు సుల్తాన్ సాయిలు, సీతారాం, గంగయ్య, రాములు, పోశెట్టి, భీంరావు, గంగారాం, లాలయ్య తదితరులున్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

బోధన్‌రూరల్,మే20: మండలంలోని సాలంపాడ్ గ్రామానికి చెందిన చిన్నగొండ (49) పురుగుల తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్ఐ నాగనాథ్ తెలిపారు. మద్యానికి బానిసై ఆర్థిక ఇబ్బందులు తోడు కావడంతో ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో గుర్తు తెలియని పురుగుల మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ జిల్లా ఆసుపత్రికి తరలించామన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

మోస్రా, మే 20: మండలంలోని చే నెంబర్ తండా దుబ్బలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మమత ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రం పిల్లలకు ఎత్తు, బరువు కొలతతలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వే రిజిష్టర్ పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని అంగన్‌వాడీ టీచర్ సుజాతకు సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మమతతో పాటు చందూర్ అంగన్‌వాడీ టీచర్ శ్రీలత, ఆయా లత, గర్భిణీ స్త్రీలు, తదితరులు పాల్గొన్నారు.

సిద్ధుల గుట్టపై ఘనంగా పల్లకీ సేవ



సిద్ధులగుట్టపై పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

పెర్కిట్, మే20: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్ధులగుట్టపై సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు.గుట్టపైకి విచ్చేసిన భక్తులందరు శివాలయంలో అభిషేకాలు, రామాలయం, దుర్గామాత, దత్తాత్రే, అయ్యప్ప ఎల్లమ్మతల్లి, ఏకశిల స్తంభం వద్ద గల హన్మాన్ ఆలయలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాలుగు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి దర్శించుకున్నారు. సిద్ధుల గుట్టపై నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లకిసేవలో భజన మండలి సభ్యులు, భక్తులు భక్తీగీతాలు, నృత్యాలతో అలరించారు. సిద్ధులగుట్ట ఆలయ కమిటీ ఆవరణలో భక్తులందరికి అన్నప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పీసీ.గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, హజారీ సతీష్, బోండ్ల ఆనంద్, పొద్దుటూరి చరణ్‌రెడ్డి, ప్రశాంత్ గౌడ్, సిద్ధులగుట్ట సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

నేడు మెంట్రాజ్‌పల్లి రైతు వేదికలో వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనాలు

డిచ్‌పల్లి, మే 20: మండలంలోని మెంట్రాజ్‌పల్లి రైతు వేదికలో ఉదయం 8గంటలకు విత్తన వేళ ఆవశ్యాకత వానాకాలానికి అనువైనా వరి వంగడలు ,వరి మొదళ్ల కాల్చివేతపై జరిగే అనార్థలపై శాస్త్రవేత్తల సలహాలు సూచనాలు ఉంటాయని రైతులు ఈ ఆవకాశం సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాంబాబు తెలిపారు.

లొంకరామలింగేశ్వర ఆలయ అభివృద్ధికి విరాళాలు



ఆలయ కమిటీకి విరాళం అందేసిన గడ్కోల్ ఎలాల్ బాపు దంపతులు

సిరికొండ మే 20: సిరికొండ సమీపాన అడవీలో కొలువుదీరిని శ్రీలొంకరామలింగేశ్వర ఆలాయ అభివృద్ధికి గడ్కోల్ గ్రామానికి చెందిన ఎలాల్‌బాపు రాంచందర్ రూ.50116లు విరాళం అందజేశారని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బాడాల సంతోష్ తెలిపారు. ఎలాల్‌బాపు దంపతులు కుమారుడు రాంచందర్ తరపును ఆలయానికి వచ్చి విరాళాన్ని అందజేయడం పట్ల కమిటీ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.దంపతులను సోమవారం ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. లొంకలో అన్న సత్రం నిర్వాహణ కోసం గాజుల హారతి శ్రీపతి దంపతులు, ఐదువేల ఒక వంద, రావుట్ల గంగామరి రాజన్న దంపతులు రూ.5020లు,తరడక రణదీర్ రూ.1011లు,ఎలాల బాపు తదితరులు అన్నసత్రం నిర్వాహణ కోసం విరాళాలు ఇవ్వడం పట్ల ఆలయ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గడ్కోల్ మాజీ ఎంపీటీసీ సభ్యులు లింబాద్రి,కమిటీ సభ్యుల బాడాల సంతోష్, అవదూత గంగాధర్, కోల భూపతిరాజ్,బోయిడి ప్రకాష్,పులి దాస్, సాంబయ్యపూజారి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ, నాసిరకం విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



బీర్కూర్ రైతు వేదికలో మాట్లాడుతున్న ఎంపీపీ రఘు

బీర్కూర్,మే 20: రాబోయే వానాకాలం సీజన్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు అందించాలని ఎంపీపీ రఘు ఆయా షాపుల యజమానులకు సూచించారు. రైతుల నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకుని నాసిరకం నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు విక్రయించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. సోమవారం బీర్కూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీపీ రఘు వ్యవసాయ అధికారులు, ఎరువులు, విత్తనాలు, పురుగుల మందుల డీలర్లతో సమావేశమయ్యారు. రాబోయే వానాకాలం సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను సరఫరా చేయాలన్నారు. రైతులకు కొనుగోలు చేసిన వాటికి షాప్ నిర్వాహకులు తప్పనిసరిగా రషీదు అందజేయాలన్నారు. గత సీజన్‌లో వరి విత్తనాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని, చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా వ్యవసాయ శాఖ అధికారులు పకడ్బందీగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి భారతి, ఏవో కమల, బీర్కూర్ సీనియర్ ఏఈవో శ్రావణ్ కుమార్, భైరాపూర్ ఏఈవో కావ్యశ్రీ, వివిధ సహకార సంఘాల అధికారులు, ప్రైవేట్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్‌గా యధావిధిగా కొనసాగుతా



ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ

ఎల్లారెడ్డి, మే 20:ఈనెల 18న ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లతో అవిశ్వాస సమావేశాన్ని నిర్వహించినంత మాత్రన తమ అధికారాన్ని కోల్పోలేదని యదావిధిగా తమ అధికారాలు కొనసాగుతాయని ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవిశ్వాస సమావేశం నిర్వహించిన తరువాత అవిశ్వాసానికి సంబంధించిన వివరాలను అవిశ్వాసం నెగ్గిందని, నెగ్గలేదని అధికారులు ఎక్కడ ప్రకటించలేదని తెలిపారు. అవిశ్వాస ప్రక్రియ కోర్టు పరిధిలో ఉందని అన్నారు. గతంలో ఉన్నట్లు తమకు అన్ని అధికారాలు ఉన్నాయని అన్నారు. మున్సిపాలిటీలో ప్రజలకు ఎక్కడైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

అర్గుల్‌లో ఘనంగా ఉర్సు ఉత్సవాలు

జక్రాన్‌పల్లి, మే20: మండలంలోని అర్గుల్ గ్రామంలో మైనారిటీ పెద్దలు ఉర్సు ఉత్సవాలను మైనారిటీ పెద్దలు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం రాత్రి ఉర్సు ఉత్సవాలు జరగగా సోమవారం గ్రంథలు ఉత్సవాలు జరుపుకున్నారు. గురువు ముజిబ్ అన్సారీ ఆధ్వర్యంలో ఉర్సు ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ ఉర్సు ఉత్సవాల సందర్భంగా మైనారి టీ గుట్ట వద్ద మూడు రోజుల నుంచి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గురువు ముజిబ్‌అన్సారీ మైనారిటీ పెద్దలు బడేమియా, పాషా, ఇంతిసరోద్దిన్, మైనారిటీ సోదరులు పాల్గొన్నారు.



ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న మైనారిటీ పెద్దలు

నిధులు మంజూరైనా పనులు సున్నా

● ఇరుకైన బ్రిడ్జి ● ఇబ్బందుల్లో వాహనదారులు



నికాల్‌పూర్,దత్తాపూర్ గ్రామాల మధ్య ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి

డొంకేశ్వర్, మే20: నికాల్‌పూర్ నుంచి దత్తాపూర్ గ్రామానికి వెళ్ళే ప్రధానరహదారిపై ఉన్న కెనాల్‌బ్రిడ్జి నిర్మాణానికి రూ.90 లక్షలు నిధులు మంజూరైన పనులు ప్రారంభం కాకపోవ డంతో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఈ రహదారి గుండా ప్రతీరోజు నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. కొత్త బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరైన కానీ పనులు చేపట్టకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు వెంట ప్రయాణించే వాహనదారులు తరచు ప్రమాదాలు జరుగుతున్నాయని మండిపడుతున్నారు. కెనాల్‌పై నూతన బ్రిడ్జి ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు రాకపోకలు సులువుగా ఉండడంతో పాటు ప్రయాణం సాఫీగా సాగుతుందని ప్రయాణికులు కోరుతున్నారు. ఇప్పుడు ఉన్న బ్రిడ్జి చాలా కాలం క్రితం నిర్మించిన బ్రిడ్జి కాలువతో పూర్తిగా శిథిలావస్థకు చేరి వాహనాలు రద్దీ పెరగడంతో బ్రిడ్జి చిన్నదిగా కావడంతో సైడ్‌వాల్ లేకపోవడంతో రాత్రి సమయల్లో అదుపు తప్పి కాలువలో పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని గ్రామస్థుల ఆందోళన చెందుతున్నారు. పంట పొలాలు పూర్తి అవ్వగానే పనులు ప్రారంభిస్తామని చెప్పిన సంబంధిత అధికా రులు కానీ ఈ రోజు వరకు పనులు ప్రారంభించకపోవ డంతో ప్రజలు అవగాహన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి చిన్నది కావడంతో మలుపు వద్ద ఎదురుగా వస్తున్న వాహనం కనబడక తరచు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గత కొన్ని రోజుల క్రితం బైక్ మీద నందిపేట్ నుంచి పనులు ముగించుకొని నికాల్‌పూర్ వైపు మాధ్యమం సమయంలో వస్తుండగా బ్రిడ్జిపై నుంచి కాలువలో పడి స్వల్ప గాయాలతో వ్యక్తి బయటపడ్డాడు. దత్తాపూర్ నుంచి ఇసుక ట్రాక్టర్ నికాల్ వైపు వస్తుండగా అదుపు తప్పి కాలువలో పడిపోయింది. నికాల్‌పూర్ నుంచి నందిపేట వైపు వెళ్తున్న కారు కాలువలో పడి కారు ధ్వంసం అయ్యింది. ఎవరికి ఎటువంటి ప్రాణపాయ నష్టం జరుగకుండా బైక్‌పై ఓ వ్యక్తి ఆ మార్గంలో ప్రయాణిస్తున్న సమయంలో మలుపు బ్రిడ్జి చిన్నదిగా ఉండడంతో ఎదురుగా వస్తున్న వాహనం కనబడక అదుపుతప్పి కాలువలో పడి మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. ఇటువంటి సంఘటనలు జరుగకుండా ముందస్తుగా పనులు ప్రారంభించిన ట్లతే రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉంటుందని వాహనదారులు కోరుతున్నారు.

పనులను త్వరగా చేపట్టాలి

నిధులు మంజూరై చాలా కాలం అవుతున్న ఇంత వరకు పనులు చేపట్టకపోవడంతో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మార్గం వెంట అనేక సంఖ్యలో వాహనాలు తిరుగుతూ ఉంటాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి కొత్త బ్రిడ్జి ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు రాకపోకలకు సౌకర్యంగా ఉంటుంది.

- జలపతిరావు నికాల్‌పూర్

నోటీసులు జారీ చేశాం

కాంట్రాక్టర్ బ్రిడ్జి నిర్మాణం పనులలో జాప్యంలో చేస్తున్నందు వల్ల నోటీసులు జారీ చేశాం. అయిన కూడా స్పందించకుంటే టెండర్లు రద్దు చేసి కొత్త వారికి టెండర్ వేసి పనులు జరిగే విధంగా చర్యలు తీసుకుంటాం.

- రఘు, ఆర్అండ్‌బీ ఏఈ

రెచ్చిపోతున్న బైక్ దొంగలు

● బాన్సువాడలో మాయమవుతున్న బైకులు ● భయాందోళనలో వాహనదారులు ● పని చేయని నిఘా నేత్రాలు



బాన్సువాడలో బైక్ మాయమైన స్థలం ఇదే..

బాన్సువాడటౌన్, మే 20: కష్టపడి సంపాదించి ఇష్టమైన బైక్ కొనుక్కున్నా అన్నా....కుటుంబానికి ఎంతగానో తోడ్పాటుగా ఉంటుందని అనుకున్నా .... కానీ నా సంతోషం కొన్ని రోజుల్లోనే ఆవిరైపోతోంది. అప్పుడే పార్కు చేసిన తన బైక్ కానరాకపోవడంతో వాహన యజమానులు ఆందోళన చెందుతున్నారు. నా బైక్ పోయిందే...ఎక్కడైనా కనబడితే నా ఫోన్ నెంబర్‌కు సమాచారం అందించగలరు అంటూ వాహన యజమానులు వాట్సాప్ గ్రూపులలో తమ వాహన నెంబరుతో సహా బైక్ పోటోలను పెడుతున్నారు. తమ వాహనాన్ని తామే వెతుక్కునే ప్రయత్నాలను చేస్తున్నారు. పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేయడంతో పాటు సామాజిక మాధ్యమాల్లో సైతం తమ వాహన ఆచూకీ కోసం వెతుకుతూ ఉన్నారు. తన వాహన జాడ కోసం వెతికి వెతికి అలసిపోతున్నారు. చివరకు ఫలితం లేకపోవడంతో దిక్కు తోచని స్థితిలో ఉండిపోతోన్నారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ పట్టణంలో బైకు దొంగలు రెచ్చిపోతున్నారు. రద్దీగా ఉన్న ప్రాంతాల నుంచి దొంగలు కనురెప్ప పాటులో బైకులను దొంగిలిస్తున్నారని వాహన యజమానులు వాపోతున్నారు. ఎక్కువ ఖరీదు ఉన్న బైకులపైనే దొంగలు దృష్టి సారించి అదను చూసి దొంగతనాలకు పాల్పడుతన్నట్లు సమాచారం.

● బాన్సువాడలో మాయమవుతున్న బైకులు

బాన్సువాడ పట్టణంలో బైకులు మాయమవుతున్నాయి. తాళం వేసిన వాహనాలను సైతం దొంగలు ఎత్తుకెళ్లిపోతున్నారు. ప్రభుత్వ , ప్రైవేటు కార్యాలయాలు , ఆస్పత్రులు, అంగడిబజార్ , ఇండ్లు ఇలా బైకులు ఎక్కడ పార్కింగ్ చేసినా కనురెప్పపాటులో మాయమవుతున్నాయని వాహన యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ వాహన జాడ కోసం విఫల ప్రయత్నాలు చేస్తున్నారు. చివరకు చేసేదేమిలేక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి బాధతో ఇంటిముఖం పడుతున్నారు. ప్రతీ అవసరంలో తోడుగా ఉండే తమ వాహనం ఒక్కసారిగా అదృశ్యం కావడంతో చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు. బైకులు బయటకు తీసుకవచ్చినా పార్కింగ్ చేయాలంటే జంకాల్సిన పరిస్థితి నెలకొంది. తాజాగా ఓ వ్యక్తి కిరాణా సామాగ్రి కొనుగోలు చేసేందుకు బాన్సువాడ పట్టణంలోని రిలయన్స్ స్మార్ట్ బజార్ వెళ్లాడు. తన వాహనాన్ని అక్కడే పార్కింగ్ చేసి లోపలికి వెళ్లి సామగ్రి తీసుకుని బయటకు వచ్చి చూడగా తన ద్విచక్ర వాహనం కనబడకుండాపోవడంతో దిగాలు చెందాడు. స్మార్ట్ బజార్ సంస్థ వచ్చిపోయే దారిలో కనీసం సీసీ కెమెరాలు కూడా లేకపోవడంతో పలువురు విస్మయానికి గురయ్యారు.

● సీసీ కెమెరాల ఆవశ్యకత ఎంతగానో ఉంది

బాన్సువాడ పట్టణం మున్సిపాలిటీగా మారిన రద్దీ బాగా పెరిగింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు వివిధ పనుల నిమిత్తం వాహనాలపై వస్తూ ఉంటారు. అయితే పెట్టిన చోట నుండే వాహనం అదృశ్యమైతే ఆ యజమాని పడే అంతా ఇంతా కాదు. ప్రస్తుతం పట్టణంలో సీసీ కెమెరాల ఆవశ్యకత ఎంతోగానో ఉంది. దొంగతనాలను అరికట్టడంలో సీసీ కెమెరాలు తోడ్పతాయి. గతంలో పోలీసు అధికారులు పట్టణంలోని పలు కూడళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అవి నేరుగా స్టేషన్‌లో ఉన్న టీవీకి కనెక్ట్ అయిఉన్నాయి. దీంతో పోలీసులకు సమాచారం తొందరగా లభ్యమయ్యేది. కానీ వాటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. పోలీసు అధికారులు చర్యలు తీసుకుని సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు బాన్సువాడలో దొంగతనాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కొండ లక్ష్మణ్ బాపూజీకాలనీ నూతన కమిటీ నియామకం

ఆర్మూర్‌టౌన్, మే20: పట్టణంలోని జిరాయత్‌నగర్ వద్ద కొండ లక్ష్మణ్ బాపూజీ కాలనీ నూతన కమిటీని ఏకగ్రీవంగా నియామించారు. సోమ వారం కాలనీ అభివృద్ధి కమిటీ సమావేశం ఏర్పాటు చేసుకొని అధ్యక్షు డిగా కట్కం ప్రకాష్, గౌరవ అధ్యక్షునిగా జిందం నరహరి, ప్రధా నకార్య దర్శి గోక నరేందర్, కోశాధికారిగా అంబల్ల దర్మవీర్, ఉపాధ్య క్షుడిగా మోర అశోక్, సహాయకార్యదర్శిగా మాన్‌పూర్ చిన్నయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకొని కాలనీ వాసులు సన్మానించారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరి మృతి

దోమకొండ,మే 20:మండలంలోని లింగుపల్లి గ్రామానికి చెందిన గుర్రపుగారి వెంకటి(50) సోమవారం ఉదయం గ్రామ శివారులో గల గుండ్ల చెరువులో బట్టలు ఉతుకుతుండగా ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు దోమకొండ పోలీసులు తెలిపారు.అతని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

1650కి.మీ దాటిన కేదారినాథ్ పాదయాత్ర

నందిపేట, మే20: మండల కేంద్రంలోని కౌల్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న పరమహంస భూమ యోగేశ్వర ఆశ్రమం నుంచి ఉత్తరఖండ్ రాష్ట్రంలోని కేదారీనాథ్ ఆలయం వరకు చేపట్టిన పాదయాత్ర ఆదివారం నాటికి 58వ రోజుకు చేరుకుంది. 2024 మార్చి 24న ఆశ్రమం నుంచి వ్యవస్థాపకులు చింత రమేష్ ఆధ్వర్యంలో చేపట్టిన కాలి నడక 1650 కిలో మీటర్లు దాటింది. ప్రస్తుతం ఆశ్రమం భక్తులు ఉత్తరఖండ్‌లోని రిషికేష్‌లో ఉన్న గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమం నుంచి బద్రీనాథ్‌కు బయలు దేరారు. డెహ్రాడూన్‌కు 05కి.మీ, రిషికేష్‌కు, బద్రీనాథ్ ఆలయానికి 260కి.మీ దూరంలో భక్తులు ఉన్నారు. ప్రతీ రోజు 30 నుంచి 40 కి.మీటర్ల వరకు పాద యాత్ర చేస్తున్నామని, మరికొద్ది రోజుల్లోనే కేదారినాథ్‌కు చేరుకుంటామని భక్తులు తెలిపారు. శ్రీ భూమ యోగేశ్వర ఆశ్రమం నుంచి పాదయాత్ర చేపట్టిన భక్తులు అందరు ఆరోగ్యంగా ఉన్నారని, ఆ దేవుడే మమ్మల్ని నడిపిస్తు న్నాడని పేర్కొన్నారు.



ఉత్తరఖండ్‌లో ఉన్న కౌల్‌పూర్ ఆశ్రమం వ్యవస్థాపకులు, భక్తులు

రైతు ఖాతాలోంచి రూ.50వేలు మాయం

లింగంపేట, మే 20 : లింగంపేట మండలంలోని అయ్యపల్లికి చెందిన రైతు చల్ల ఆదిరెడ్డి బ్యాంక్ ఖాతా నుంచి ఆదివారం సైబర్ నేరగాళ్లు సెల్‌ఫోన్‌ను హ్యాక్ చేసి రూ.50వేలు దోచేశారని బాదితుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫోన్ హ్యాక్‌చేసిన నేరగాళ్లు నెల రోజుల క్రితమే దక్కన్ గ్రామీణ బ్యాంక్ పేరుతో లింక్ పంపించారు. బ్యాంక్ లింక్ అనుకొని ఓపెన్ చేసినట్లు బాధితుడు తెలిపాడు. అప్పటి నుంచి అతని ఖాతాలో డబ్బులు లేవు ఆదివారం తన స్నేహితుడు ఆదిరెడ్డి ఖాతాకు రూ.50వేలు పంపించగా అదే రోజు రెండు ఓటీపీలు వచ్చి ఖాతా నుంచి ఒక్కోసారి రూ.25వేల చొప్పున విత్‌డ్రా కావడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా సైబర్ క్రైమ్ నెంబర్‌కు ఫోన్ చేసి కేసు రిజిస్టర్ చేసినట్లు బాదితుడు తెలిపాడు. సైబర్ నేరగాళ్ల పట్ల బ్యాక్ ఖతాదారులు జాగ్రత్తగా ఉండాలని ఎస్సై చైతన్యకుమార్ తెలియజేశారు.

ప్రమాదం అంచున ప్రయాణం



దుర్గం రోడ్డు సమీపంలో శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి

గాంధారి,మే 20: గాంధారి మండలంలోని దుర్గం,గుజ్జల్‌తాండ, బీర్మల్‌తండా, జెమినితాండలకు వెళ్లె దుర్గం రోడ్డు సమీపంలోని వాగుపై ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు బ్రిడ్జికూలుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. గత కొన్ని సంవత్సరాలు ఇదే పరిస్థితి ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.గత సంవత్సరం క్రితం వర్షకాలంలో కురిసిన భారీ వర్షాలకు బ్రిడ్జిపై నీరు పారడంతో బ్రిడ్జి శిథిలవస్థకు చేరుకుంది. ప్రభుత్వం వెంటనే స్పందించి నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు.

ఎత్తిపోతల కమిటీ అధ్యక్షుడికి సన్మానం

డొంకేశ్వర్, మే20: ఎత్తిపోతల కమిటీ చైర్మన్‌ల ఉమ్మడి నందిపేట, డొంకేశ్వర్ మండలాల అధ్యక్షునిగా ఎన్నికైన శుభసందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు నూత్‌పల్లి గ్రా మంలో మోర్తాడ్ బోజారెడ్డిని కలిసి శాలువతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలి పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద మహిపాల్, డీసీసీ ఉపాధ్యక్షుడు పెంట ఇంద్రుడు, డీసీసీ జనరల్ సెక్రెటరీ దేగాం గంగారెడ్డి,యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై జిలుగ విత్తనాలు



ఏర్గట్లలో జిలుగు విత్తనాల పంపిణీ ప్రారంభిస్తున్న ఏవో అబ్దుల్ మాలిక్

ఏర్గట్ల, మే 20: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద సోమవారం రైతులకు సబ్సిడిపై జిలుగు విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీపై రూ.1116 లకు అందజేస్తుందని దీని కోసం రైతులు ఆధార్ కార్డు, పట్టాపాస్ బుక్ జిరాక్స్ అందజేసి విత్తనాలు పొందాలని తెలిపారు. ఈకార్యక్రమంలో సీఈవో జక్కని శ్రీనివాస్, ఏఈవో సాయిసచిన్‌లు పాల్గొన్నారు.

● నేడు ఘన్‌పూర్, రాంపూర్‌లో జీలుగ విత్తనాలు పంపిణీ

డిచ్‌పల్లి: మండలంలోని ఘన్‌పూర్, రాంపూర్ గ్రామాల రైతులకు జీలుగ విత్తనాలు నేడు ఉదయం 8గంటలకు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, తీసుకొచ్చి జీలుగ విత్తనాలు పొందలన్నారు. 30కిలోల బస్తా రూ.1116చెల్లించలని,ఈఆవకాశం రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రాయితీపై జీలుగ విత్తనాల పంపిణీ

ముప్కాల్: రైతులు సబ్సిడీపై వచ్చే జీలుగ విత్తనాలను ఉపయోగించుకొని భూసారాన్ని పెంచుకోవాలని భీమ్‌గల్ డివిజన్ ఏడీఏ కంపాటి మల్లయ్య అన్నారు. ముప్కాల్, బాల్కొండ మండలాల్లో రైతులకు రాయితీపై జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. సోమవారం ముప్కాల్ మండలంలోని రెంజర్ల సొసైటీలో, బాల్కొండ సొసైటీలో 30కేజీల జీలుగ విత్తనాల బస్తా రూ.2790 కాగా 60శాతం సబ్సిడీ ద్వారా రూ.1116అందిస్తున్నట్టు వ్యవసాయాధికారి తెలిపారు. 30కేజీల జీలుగ విత్తనాల బస్తా ఒక ఎకరానికి సరిపోతుందని, రైతులు తమ పట్టాపాస్ బుక్ జిరాక్స్‌తో సొసైటీలో రాయితీపై జీలుగ విత్తనాలు తీసుకువెళ్ళాలని వ్యవసాయాధికారులు రాజ్‌కుమార్, మహేందర్‌లు తెలిపారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలి



డొంకేశ్వర్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

డొంకేశ్వర్, మే20: రైతులకు నాణ్యమైన అన్ని రకాల విత్తనాలను ఎరువులను ఉచితంగా ప్రభుత్వం సరఫరా చేయాలని అఖిల భారత ప్రగతి శీల రైతు కూలీ సంఘం మండల అధ్యక్షుడు గంగాధర్ అన్నారు. సోమవారం డొంకేశ్వర్ మండల కేంద్రంలోని తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని రైతులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో ఏకాలంలో రూ.2లక్షలు రుణమాఫీ చేయాలని అన్నారు. రైతులకు పనిముట్లను ప్రభుత్వం సబ్సిడీలపై అందించాలని డిమాండ్ చేశారు. వరి పండించిన రైతులకు ప్రభుత్వం రూ.500 బోనస్‌ను రైతులకు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు మేలు రకమైన విత్తనాలు సరఫరా చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజలింగం, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్, దామరంచలో జీలుగ విత్తనాలు పంపిణీ



బీర్కూర్‌లో జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏవో కమల

బీర్కూర్, మే 20: బీర్కూర్ మండలంలోని బీర్కూర్, దామరంచ సహకార సంఘాలలో సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో కమల మాట్లాడుతూ బీర్కూర్, దామరంచ సహకార సంఘాలలో 166 బస్తాల చొప్పున 332 బస్తాల జీలుగ విత్తనాలు రైతులకు పంపిణీ చేసేందుకు సిద్దంగా ఉంచామన్నారు. ఒక్కో బస్తా 30కేజీలు బరువు కలిగి ఉంటుందన్నారు. ఒక్క బస్తా కొనుగోలు చేస్తే రెండున్నర ఎకరాలకు సరిపోతుందని తెలిపారు. ఎకరానికి 12 కిలోల జీలుగు వేసుకోవచ్చని ఆమె రైతులకు సూచించారు. బహిరంగ మార్కెట్‌లో 30 కేజీల బస్తా ధర రూ.2,790 ఉంటుందని, ప్రభుత్వం 60 శాతం రూ.1674 భరిస్తుందన్నారు. రైతులకు రూ.1116 చెల్లించి బస్తా కొనుగోలు చేయవచ్చన్నారు. రాయితీపై విత్తనాలు పొందడానికి రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌తో పాటు మొబైల్ నెంబర్ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీర్కూర్ సీనియర్ ఏఈవో శ్రావణ్‌కుమార్, భైరాపూర్, ఏఈవో కావ్యశ్రీ, బీర్కూర్‌సహకార సంఘం సీఈవో విఠల్, సెల్ఫ్ మెన్ సాయిలు, రైతులు అవారి తదితరులు పాల్గొన్నారు.

సుంకెట్‌లో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సుంకెట్‌లో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

మోర్తాడ్,మే 20:మండలంలోని సుంకెట్ గ్రామంలో 2000-21 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు సోమవారం ఒక చోట కలుసుకొని పూర్వవిద్యార్థులు సమ్మేళన కార్యక్రమం సంతోషంగా జరుపుకున్నారు. పలు ప్రాంతాలలో వివిధ వృత్తులు, ఉద్యోగులుగా, వ్యాపారస్థులుగా స్థిరపడిన పూర్వవిద్యార్థులు 24ఏళ్ల తర్వాత కలుసుకొని ఒకరినోకరు పలకరించుకొని కుటుంబ విషయాలను తెలుసుకున్నారు.అనాటి పాఠశాలలో చదివిన స్మృత్తులను జ్ఞాపకం చేసుకుంటూ గడిపారు. తమకు విద్యబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను పూలమాలలు,శాలువతో ఘనంగా సన్మానిం చారు. పూర్వవిద్యార్థులు సహపంక్తి భోజనాలు చేసి వారంత సంతోషంగా గడిపారు.

కార్యకర్త అంతిమ యాత్రలో మాజీ ఎమ్మెల్యే



బీజేపీ కార్యకర్త అంతిమ యాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే యెండల

డిచ్‌పల్లి,మే 20: ఖిల్లా డిచ్‌పల్లి గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త చిలకమరి సంతోశ్ అంతిమ యాత్రలో నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ పాల్గొని నివాళ్లు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉండటానని హామీ ఇచ్చారు.సంతోష్ ఆదివారం పంట చేను వద్ద ఉరేసుకొని ఆత్మహత్యా చేసుకున్నాడు.ఈఅంతిమ యాత్రలో మండల బీజేపీ నాయకులు వెంటకరమణ, రవిగౌడ్,లక్ష్మన్,బాలయ్య, ఉన్నారు.

నగరంలో భారీ చోరీ

● తాళం వేసిన ఇంటి నుంచి 20తులాల బంగారం అపహరణ

ఖిల్లా,మే 20: నగరంలోని ఆరోటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో దొంగలు హల్‌చల్ చేశారు. తాళం వేసి ఉన్న ఇంటిలో చొరబడి సుమారు 20తులాల బంగారు ఆభరణాలు, రూ30వేల నగదును అపహరించినట్లు ఆరోటౌన్ ఎస్ఐ మహేష్ తెలిపారు. నగరంలోని షాద్‌నగర్‌లో నివాసం ఉండే మహ్మద్ అబ్దుల్ సలాం కుటుంబం ఆదివారం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. దీనిని గమనించిన కొందరు గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళం ధ్వంసం చేసి లోనికి చొరబడ్డారు. ఇంటిలోని బీరువాను ధ్వంసం చేసి అందులో ఉన్న విలువైన బంగారు ఆభరణాలు, రూ30వేల నగదును అపహరించుకుని వెళ్లారని ఎస్ఐ తెలిపారు. బాధితుడు రాత్రి సుమారు 12గంటల అనంతరం ఇంటికి వచ్చి చూడగా ఇంటికి వేసిన తాళం ధ్వంసం అయి ఉండడాన్ని గమనించి లోనికి వెళ్లారు. ఇంటిలోని బీరువాలోని సామాను చిందరవందరగా పడి ఉండడాన్ని గమనించి వెంటనే బీరువాను పరిశీలించగా అందులో ఉండాల్సిన విలువైన వస్తువులు కనిపించకపోవడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆప్రాంతంలో ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలించారు దుండగుల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. బాధితుడు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటు జీవనం సాగిస్తున్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

గ్రాంట్ టెస్ట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● టీయూ రిజిస్ట్రార్‌యాదగిరి



టీయూలో పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ యాదగిరి

డిచ్‌పల్లి, మే 20:గోల్కొండ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 26న నిర్వహించే గ్రాండ్ టెస్ట్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి సూచించారు. సోమవారం గిరిజనశక్తి అధ్యక్షుడు శ్రీను రాథోడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోస్టర్‌ల ఆవిష్కరణ కార్యక్రమానికి రిజిస్ట్రార్ యాదగిరి హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీను నాయక్ మాట్లాడుతూ.. గ్రూప్1,2 గ్రాంట్ టెస్ట్‌లు అభ్యర్థులు సద్వినియోగం చేసుకొని పరీక్షల భయం దూరం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ ఉపాధ్యక్షుడు సాగర్, రాజేందర్, శ్రీనివాస్, నరేశ్, నవీన్ పాల్గొన్నారు.

లైసెన్సు కలిగి ఉన్న కంపెనీల విత్తనాలనే రైతులకు అమ్మాలి

● బోధన్ ఏసీపీ శ్రీనివాస్



ఫర్టిలైజర్ షాపులో విత్తనాలను పరిశీలిస్తున్న ఏసీపీ

ఎడపల్లి, మే 20: లైసెన్సు కలిగి ఉన్న కంపెనీల విత్తనాలనే రైతులకు డీలర్లు అమ్మాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. ఎడపల్లి మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ షాపులను సోమవారం రాత్రి మండల వ్యవసాయ శాఖ అధికారి సిద్ద రామేశ్వర్‌తో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు దుకాణాలలో ఉన్న వరి విత్తనాలను, వాటి రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ డీలరు లైసెన్సు కలిగి ఉన్న కంపెనీల వద్దనే వరి విత్తనాలు కొని వాటిని రైతులకు అమ్మాలని ఆయన సూచించారు. రైతులు విత్తనాలు కొనే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకుని వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన కంపెనీ, వాటి లైసెన్సు నంబరు చూసుకుని డీలర్ వద్ద కొనుగోలు చేయాలని కొనుగోలు చేసిన వరి విత్తనాలకు తప్పకుండా జీఎస్టీ నంబరు ఉన్న రశీదును పొందాలని ఆయన సూచించారు. దుకాణ యజమాని ఇచ్చిన రశీదును పంటకాలం పూర్తయ్యే వరకు దగ్గర ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణా రెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు జీలుగ విత్తనాల పంపిణీ

ఇందల్వాయి, మే 20: .ఇందల్వాయి మండల పరిధిలోగల ఇందల్వాయి, నల్లవెల్లి సొసైటీలలో మంగళవారం జీలుగ విత్తనాల పంపిణీ ఉందని మండల వ్యవసాయ అధికారులు తెలిపారు. ఇందల్వాయి సొసైటీకి 333 బ్యాగుల జీలుగ విత్తనాలు, నల్లవెల్లి సొసైటీకి 500 బ్యాగులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఈ విత్తనాల పంపిణీ కార్యక్రమం ఉదయం 8.30 నుంచి కొనసాగుతుందన్నారు. ఒక్కో బ్యాకు ధర రూ.1116లు ఉందని రైతులు కొత్త పట్టాపాసుబుక్, ఆధార్‌కార్డు తీసుకొని వచ్చి విత్తనాలను తీసుకోవాలని కోరారు. ఒక్కో జీలుగ సంచి రెండున్న ఎకరాలకు సరిపోతుందని ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆదర్శ పాఠశాల పనుల తనిఖీ

కమ్మర్‌పల్లి, మే 20: రాష్ట్రప్రభుత్వం మండలంలోని వివిధ పాఠశాలల్లో అమ్మఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతులకల్పన నిమిత్తం మంజూరిచ్చిన పనులను కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజాశ్రీనివాస్, మండల ఏపీఎం కుంటగంగారెడ్డితో కలిసి సోమవారం సందర్శించి పరిశీలించారు. మండంలోని కొత్తచెరువుతాండా, వాసంగట్టుతాండా, ఇనాయత్ నగర్, నర్సాపూర్ గ్రామ పాఠశాల్లో గుల మరమ్మతులు, మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి సదుపాయం, విద్యుదీకరణ, తదితర పనులను ఆయన పర్యవేక్షించారు. పనులపట్ల సంతృప్తిని వ్యక్తం చేస్తూ నెలాఖరులోగా వందశాతం పనులు పూర్తికావాలని ఆదేశించారు. ఆయన వెంట సీసీవర్దం శ్రీనివాస్, గ్రామపంచాయతీ కార్యదర్శులు నవీన్, విజయ్ తదితరులు ఉన్నారు.

వర్షాకాలం లోపు వంతెన పూర్తయ్యేనా

● ఇందల్వాయి, ధర్పల్లి రోడ్డు మధ్యలో కొనసాగుతున్న వంతెన పనులు ● పనులు పూర్తికాకపోతే తిప్పలు తప్పవు



వెంగల్‌పాడ్ వద్ద కొనసాగుతున్న వంతెన పనులు



వెంగల్‌పాడ్ వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు

ఇందల్వాయి, మే 20: ఇందల్వాయి, ధర్పల్లి మార్గమధ్యలో గల వెంగల్‌పాడ్ తాండా, లింగాపూర్ వాగుపై వంతెన పనుల కోసం గతంలో 12కోట్ల రూపాయలు మంజూరు కాగా వెంగల్‌పాడ్ వద్ద వంతెన పనులు కొనసాగుతుండగా లింగాపూర్ వంతెన పనులు ఇప్పటికి ప్రారంభం కాలేదు. గత ప్రభుత్వ హయాంలో లోలెవల్ వంతెనలతో ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని హైలెవల్ వంతెన నిర్మాణం కోసం గతంలో ఉన్న రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ 2023 అక్టోబర్ నెలలో వెంగల్‌పాడ్ వంతెన నిర్మాణానికి 5కోట్లు, లింగాపూర్ వంతెన నిర్మాణానికి 7కోట్ల రూపాయలతో శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసిన కొద్దిరోజులకే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో వంతెన పనులు ప్రారంభించలేదు. ఎన్నికలు పూర్తై కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరోసారి ఎమ్మెల్యేగా ఎంపికైన డాక్టర్ భూపతిరెడ్డి ఈ సంవత్సరం జనవరి నెలలో వెంగల్‌పాడ్, లింగాపూర్ వాగులపై వంతెన నిర్మాణం కోసం రెండవసారి శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసిన మూడు నెలల తర్వాత వెంగల్‌పాడ్ వంతెన నిర్మాణం పనులు ప్రారంభించారు. వర్షాకాలంలోపు లింగాపూర్, వెంగల్‌పాడ్ వంతెన నిర్మాణం పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అధికారులను ఆదేశించినప్పటికీ కేవలం వెంగల్‌పాడ్ వంతెన పనులు మాత్రమే ప్రారంభించారు. వంతెన నిర్మాణం చేపడుతూ పక్కనుండి తాత్కాలిక రోడ్డును ఏర్పాటు చేసి వంతెన పనులను కొనసాగిస్తున్నారు. పూర్తి శిధిలావస్థలో చేరిన లింగాపూర్ వంతెన పనులు ఇప్పటికి ప్రారంభించలేదు. రానున్న వర్షాకాలంలోపు పనులు పూర్తికాకుంటే తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోవడమేకాకుండా ఇందల్వాయి నుండి ధర్పల్లి, సిరికొండ, భీంగల్ తదితర మండలాలకు వెళ్లే వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు తప్పవని ప్రజలు చర్చించుకుంటున్నారు. గతంలో లింగాపూర్ వద్ద గల వంతెన శిధిలావస్థకు చేరి వంతెనపై ఏర్పడ్డ గుంతల వల్ల ఇప్పటికే చాలా మంది వాహనదారులు వాహనాలపై నుండి పడి తీవ్ర గాయాల పాలైయ్యారు. గతంలో ప్రభుత్వం వంతెన నిర్మాణానికి నిధులు కేటాయించారన్న వార్తతో ప్రజలు సంతోషం వ్యక్తం చేసినప్పటికీ పనులు ప్రారంభించకపోవడం వల్ల నిరాశ చెందుతున్నారు. ఈ వర్షాకాలం భారీ వర్షాలు కురిస్తే లింగాపూర్ వంతెన ఉంటుందా కొట్టుకుపోతుందా అని ఆందోళన చెందుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని కోరుతున్నారు.

నిర్మాణం పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలి



ఇందల్వాయి నుండి ధర్పల్లి వెళ్లే రోడ్డు మార్గమధ్యలో గల లోలెవల్ వంతెనలు చాలా ప్రమాదకరంగా మారాయని వాటిని హైలెవల్ వంతెనలుగా మార్చేందుకు నిధులు మంజూరు కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. నిధులు మంజూరైన పనులు నత్తనడకన సాగుతున్నాయని వర్షాకాలంలోపు పనులు పూర్తి చేసి వాహనదారులకు వంతెనలను అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వంతెనలు పూర్తికాకపోతే రానున్న వర్షాకాలంలో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయి. ఇందల్వాయి నుంచి ధర్పల్లి, సిరికొండ, భీంగల్ మూడు మండలాలకు వెళ్లే వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అధికారులు స్పందించి పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలి.

\- సంగెం కిష్టయ్య, అంబేద్కర్ సంఘం మండల అధ్యక్షుడు

శివాలయానికి చెందిన భూమిలోనే గుడి నిర్మాణం జరిగింది

● ఏవరి భూమిని ఆక్రమించలేదు ● డిచ్‌పల్లి కాశీ విశ్వనాథ ఆలయ కమిటీ సభ్యులు వెల్లడి

డిచ్‌పల్లి, మే 20: డిచ్‌పల్లి మండల కేంద్రంలోని కాశీ విశ్వనాథ ఆలయం పూర్తిగా సర్వే నంబరు 239నంబర్‌లో మాత్రమే నిర్మాణం జరిగిందని, ఏవరి ప్రైవేట్ పట్టా భూముల్లో కబ్జాలు చేయాలేదని కాశీ విశ్వనాథ ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 239సర్వే నంబరు లో గుడికి ఎదురుగల భూమి శిఖం భూమి అని రెవెన్యూ అధికారులు తెలిపారని, కానీ మండల కేంద్రానికి చెందిన డాక్టర్ అశోక్ కావలని ఆరోపనాలు చేస్తు తప్పుడు ధ్రువపత్రాలతో అధికారులకు ఫిర్యాదు చేయడం సరికాదన్నారు. గుడి పూర్తిగా 239సర్వే నంబరులో అధికారుల పర్మిషన్ తీసుకొని నిర్మించామని, 235నంబర్ భూమితో శివాలయం భూములకు సంబంధం లేదని తెలిపారు. రెవెన్యూ అధికారులకు తమ ఆలయ కమిటీ సభ్యులు సహకరి స్తామని సర్వే నిర్వహిస్తే తాము ముందుకు వచ్చి ఈ ఆరోపనాలు నిజమని తేలిస్తే శివాలయం భూమిని సైతం ఇవ్వడానికి సిద్ధమని ప్రకటన చేశారు. దేవాలయ భూములను అన్యాక్రాంతం చేయాలని చూస్తున్న వారికి అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ విలేకర్ల సమావేశంలో కాశీ విశ్వనాథ ఆలయ ప్రతినిధులు బండి జానేశ్వర్, సత్యనారాయణ, చెంచిరెడ్డి, మోహన్ రెడ్డి, గంగారెడ్డి, రాజరాం, దాసు, రాజశేఖర్, రాజేశ్, వేణు, రాజేందర్, రాము, సుభాశ్ గుప్త, పాల్గొన్నారు.



డిచ్‌పల్లిలో మాట్లాడుతున్న కాశీ విశ్వనాథ ఆలయం కమిటీ సభ్యులు

రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో ఆల్ఫోజోం పట్టివేత

● గోప్యంగా ఉంచుతున్న పోలీసులు

నిజామాబాద్ రూరల్, మే, 20: కల్లు తయారీలో వినియోగించే నిషేదిత మత్తుపదార్థం (డైజోఫాం, ఆల్ఫోజోం)ను పెద్ద ఎత్తున పట్టుకున్నట్లు పలువురు అను మానం వ్యక్తంచేశారు. నిజామాబాద్ రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ కల్లు డిపోకు చెందిన వ్యక్తి ఇంట్లో కిలోల చొప్పున దాచి ఉంచినట్లు విశ్వసనీయ సమాచారం రూరల్ పోలీసుశులు ఇచ్చారు. వారి సమాచారం మేరకు రూరల్ పోలీసు స్టేషన్ ప్రత్యేక బృందం ఆదివారం రాత్రి సమయంలో దాడులు చేసి లక్షల విలువైన మత్తుపదార్థాన్ని పట్టుకున్నారు. పోలీసులు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. వీరికి ఆ పదార్థం సరఫరా చేసిన వ్యక్తులను పట్టుకునేవరకు సమాచారం బయటకు చెప్పవద్దని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. అందులో భాగంగానే ఈ సమాచారాన్ని రూరల్ పోలీసు అధికారులు బయటకు సమాచారం పొక్కనీయడం లేదు. ఈ విషయం సదరు పోలీసులను సంప్రదించేందుకు ఫోన్‌లు చేసినా సమరియైన సమాచారం ఇవ్వలేదు. పూర్తివివరాలు తెలుసుకుని విలేకరుల సమావేశంలో వెల్లడిస్తామని ఓ అధికారి తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

సుభాష్‌నగర్, మే 20:నగరంలోని వినాయక్‌నగర్ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని నగర టౌన్-3 ఏడీఈ వీరేశం తెలిపారు.ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్ప డుతుందని తెలిపారు. వినాయక్‌నగర్ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని వినాయక్‌నగర్, పూలాంగ్, గాయత్రీనగర్, కోటగల్లి, జెండాగల్లి,శ్రీనగర్‌కాలనీ, షిర్డీ, సాయికృపానగర్, వంద ఫీట్ల రోడ్, పద్మానగర్, హనుమాన్‌నగర్, సాయినగర్, చంద్రనగర్, బడాబజార్, పాటిగల్లి, యాదగిరిబాగ్, కోటగల్లి, గూడెం, హౌసింగ్‌బోర్డు, తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులుసహకరించాలని కోరారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

ధర్పల్లి, మే 20: ధర్పల్లి మండల సర్వసభ్య సమావేశం ఈనెల 22న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బాలకృష్ణ సోమవారం తెలిపారు. ఎంపీపీ సారిక హన్మంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశం ఉదయం 11గంటలకు జరుగుతుందన్నారు. మండలస్థాయి అధికారులు, ఎంపీటీసీలు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వారం గడిచిన అందని ఎన్నికల నిధులు

ధర్పల్లి, మే 20: ఈనెల 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సిబ్బందికి ఇంతవరకు సంబంధిత టీఏ, డీఏలు రాలేదని వాపోతున్నారు. ఎన్నికల్లో పనిచేసిన రూట్ ఆఫీసర్, పంచాయతీ కార్యదర్శులు, సఫాయి కార్మికులకు సంబంధించి విధులు నిర్వహించి వారం గడిచిన ఎలాంటి నిధులు అందలేదు. కార్యదర్శులు ఎన్నికల సిబ్బందికి భోజన సౌకర్యం కల్పించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటి వరకు అరకొర నిధులతోనే కాలం గడిపారు. మిగతా మొత్తం ఇంతవరకు రాలేదని సంబంధిత అధికారులు వాపోతున్నారు. ఈవిషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

మండల వ్యవసాయ అధికారిగా వెంకటేశ్

ధర్పల్లి, మే 20: మండల వ్యవసాయ అధికారిగా వెంకటేశ్‌కు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ వ్యవసాయ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ప్రవీణ్‌కుమార్ గుండెపోటుతో మృతి చెందడంతో ఏవో పోస్టు ఖాళీ కావడంతో సిరికొండలో వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్న వెంకటేశ్‌కు అదనపు బాధ్యతలు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రైతులకు అందుబాటులో ఉంటానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలకు రూ. కోటి 9 లక్షలు

ధర్పల్లి,మే 20: మండలంలో ఎంపిక చేసిన అమ్మ ఆదర్శ పాఠశాలలకు ఆప్ ప థకం కింద కోటి 9లక్షల 41వేలు మంజూరు అయ్యాయని ఎంపీడీవో బాలకృష్ణ తె లిపారు. సోమవారం మండలంలోని ఆ యా గ్రామాల్లో గల పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఈ మొత్తాన్ని వెచ్చించనున్నట్లు ఆయన తెలిపారు. మండలంలో 25 పాఠశాలలు ఈపథకం కింద ఎంపికయ్యాయని ఆయన తెలిపారు. విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన చెప్పారు. పాఠశాలల ప్రారంభంలోపే ఈ సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలోని ఒన్నాజిపేట్ ప్రాథమిక పాఠశాలతో పాటు ఉర్దూ మీడియం, నడిమితాండా, రూప్‌సింగ్ తాండా, కార్నర్ తాండా, వాడి, గోవింద్‌పల్లి తదితర ప్రాథమిక పాఠశాలలను ఆయన పరిశీలించారు.



పాఠశాలలో సౌకర్యాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

అనుమానాస్పదంగా యువకుడి మృతి

మోపాల్, మే 20: మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిర్పూర్ గ్రామానికి చెందిన సాయికుమార్ (18) సోమవారం అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. రిపోర్టు వచ్చిన తర్వాత తదుపరి విచారణ చేపడుతామని అన్నారు.

రెండు బైకులను ఢీకొట్టిన కారు

మోపాల్,మే 20:మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒడ్డెరకాలనీ సమీపంలో ఆదివా రం రాత్రి కారు అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ ఎదురుగా వస్తున్న రెండు బైకులను ఢీకొనడంతో నర్సింగ్‌పల్లి గ్రామానికి చెందిన జాన్కంపేట్ గంగాధర్ పరిస్థితి విషమంగా ఉండటంతో అతన్ని నగరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో గాయపడిన గంగాధర్ కుమారుడు పుట్టినరోజు కావడంతో నిజామాబాద్ వచ్చి కేక్ తీసుకొని వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. కొడుకు పుట్టినరోజు తండ్రికి గాయాలు సీరియస్‌గా ఉండటంతో గ్రామంలో విషాదం నెలకొంది. గంగాధర్ గ్రామంలో మినరల్ వాటర్‌ను సరఫరా చేస్తారని గ్రామస్తులు తెలిపారు. బాధితులు ఫిర్యాదు మేరకు కారు నడుపుతున్న సంపత్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు.

పద్మశాలీ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు



ప్రతిభ పురస్కారాలు అందజేస్తున్న సంఘ సభ్యులు

నిజామాబాద్ అర్బన్, మే 20: కొండ లక్ష్మణ్ బాపూ జీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని పద్మశాలీ విద్యార్థులకు 10వ తరగతి, ఇంటర్‌లో అత్యధిక మా ర్కులు సాధించిన వారికి ప్రతిభ పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు పెంట దత్తాద్రి మాట్లాడుతూ 2023 నుంచి ఈ కమిటీ ద్వారా ఎన్నో కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేస్తున్నామన్నారు. ఇంటర్ లో అత్యధిక మార్కులు సాధించిన వారికి రూ.4వేలు, 10వ తరగతిలో అత్యుత్తమ మా ర్కులు సాధించిన వారికి 3వేలు, ఇతరత్ర నగదు పురస్కారాలను అందజేస్తున్నామని అన్నారు. సలహాదారుడు ఎస్ఆర్ సత్యపాల్ సహకారంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బూ సరవి, సురేందర్, భీమర్తిరవి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జరిమానా

ఖిల్లా,మే 20:మద్యం సేవించి వాహనాలు నడిపిన 31 మందిని గుర్తించి వారికి కౌన్సిలింగ్ నిర్వహించినట్లు ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ వి.వెంకటనారయణ తెలిపారు. పోలీసు కమీషనర్ కల్మేశ్వర్‌శింగేవార్ ఆదేశాల మేరకు ప్రతిరోజు ట్రాఫిక్ ఏసీపీ నారాయణ నేతృత్వంలో సిబ్బందితో వాహనాల తనిఖీ చేపడుతున్నట్లు చెప్పారు. ఆదివారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేయగా అందులో 31 మంది మద్యం సేవించి వాహనాలు నడిపినట్లు గుర్తించామన్నారు. వారిని సోమవారం ఉదయం కోర్టు ఎదుట హాజరు పర్చగా 29మందికి రూ.40500జరిమాన, మరో ఇద్దరికి జైలు శిక్షను మెజిస్ట్రేట్ ఎం.ఎం.అలీసిరాజ్ విధించారు. వీరిలో సతీష్‌రెడ్డికి 3రోజుల శిక్షతో పాటు రూ. 2000ల జరిమాన విధించారు. మరో వ్యక్తి దేవారి శంకర్‌కు 20 రోజుల జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

ఆర్మూర్‌లో నేడు, రేపు నీటి సరఫరాలో అంతరాయం

ఆర్మూర్‌టౌన్, మే20: పట్టణంలో మిషన్ భగీరథ నీటి సరఫరాలో నేడు, రేపు అంతరాయం ఉందని మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. బాల్కొండలోని నీటిశుద్ధి కేంద్రం వద్ద డీఐపైపు లీకేజీ ఏర్పడినం దున వాటి మరమ్మతులు చేయడం కోసం మంగళ, బుధవా రాల్లో నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు ప్రజ లు సహకరిం చాలని ఆయన కోరారు.

ఎస్ఎస్‌కె సమాజ్ అధ్యక్షుడిగా రెడ్డిప్రకాష్

ఆర్మూర్‌టౌన్, మే20: ఎస్ఎస్‌కె సమాజ్ అధ్యక్షుడి గా రెడ్డి ప్రకాష్‌ను సమాజ్ సభ్యులు ఎన్నుకున్నారు. సో మవారం పట్టణంలోని ఎస్ఎస్‌కె సమాజ్ భవన్‌లో ఎన్నికైన రెడ్డి ప్రకాష్‌ను శాలువ, పూలమాలతో సభ్యు లు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బారడ్ గంగామోహన్, హరినారాయణ ఖాండేశ్ శ్రీనివాస్, పండిత్ పవన్, ప్రేమ్, దినేష్, బారడ్ కిశోర్, సత్యనా రాయణ, కిరణ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

24 నుంచి ఎస్‌బీఐలో ఉచిత ఫొటోగ్రఫీ, వీడియో గ్రఫీ శిక్షణ

డిచ్‌పల్లి, మే 20: ఎస్‌బీఐ స్వయం ఉపాధి డిచ్‌పల్లి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదిన ఉచిత ఫోటో గ్రఫీ, వీడియో గ్రఫీ శిక్షణ ప్రారంభం కానుందని డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువకులు ఈ ఆవకాశం సద్వినియోగం చేసుకోవాలని 27వ తేదినుంచి ఎలక్ట్రీషియన్ శిక్షణ ప్రారంభిస్తున్నట్లు డైరెక్టర్ తెలిపారు.

ఖిల్లా డిచ్‌పల్లిలో నర్సింహ స్వామికి ప్రత్యేక పూజలు

డిచ్‌పల్లి, మే 20: మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి గ్రామంలో లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామస్తులు పెద్ద ఎత్తున పూజల్లో పాల్గొన్నారు.ప్రత్యేక అర్చనలు, అభిషేకలు జరిపారు.



ముస్తాబైన నర్సింహస్వామి విగ్రహాలు

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.140	రూ.270	రూ. 290
వెన్‌కాబ్(కిలో)	రూ.145	రూ.275	రూ. 295

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.74,400	రూ.68,500	రూ.885

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : కృష్ణమ్మ (1.20, 7.25)
: కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (ఇంగ్లీష్) (4.15)
: అపరిచితుడు (10.20)
స్ర్కీన్-2 : ది ఫ్యూరోసా మూవీ (ఇంగ్లీష్ 3డి) (12.00, 2.25, 4.50, 7.15, 9.40)
స్ర్కీన్-3 : కర్గమ్ భుగ్గం (హిందీ) (1.10)
: ఆ ఒక్కటి అడక్కు (4.05)
: శ్రీకాంత్ (హిందీ) (7.00, 10.00)
స్ర్కీన్-4 : నటరత్నాలు (12.10)
: దర్శిని (2.50)
: మిరల్ (5.30, 10.30)
: అక్కడ వారు ఇక్కడ ఉన్నారు (8.05)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-2 : ఆ ఒక్కటి అడక్కు (11.00, 1.45, 4.50, 7.35, 10.35)
స్ర్కీన్-3 : మిరల్ (1.55)
: కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (తెలుగు) (4.45, 10.35)
: బాక్ (7.35)

\- నిజామాబాద్ అర్బన్